జన హృదయ నేత డాక్టర్ వైఎస్సార్

- ఆయన హయాంలో రాష్ట్రంలో స్వర్ణయుగం
- ఘనంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు
- మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలను మంగళవారం కర్నూలు నగరంలో ఘనంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎస్వీ కాంప్లెక్స్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. జోహార్ వైఎస్సార్.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన రాష్ట్రంలో స్వర్ణయగం అన్నారు. చరిత్రలో నిలిచేలా పథకాలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించారని, ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరం కాకూడదని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు, వ్యవసాయానికి ఉచిత కరెంటు, 108 అంబులెన్స్ వంటి ఎన్నో పథకాలను అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రానికి సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేరు గుర్తుండేలా ప్రజలకు ఒక్కటైనా మంచి పథకం అమలు చేశారా? అని ప్రశ్నించారు. అన్ని వర్గాలకు అరాధ్య దేవుడిగా ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలు లేని జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం లేదన్నారు. ఆయన చనిపోయి 16 సంవత్సరాలు అవుతున్నా లక్షలాది మంది ప్రజలు ఇప్పటికీ ఆరాధిస్తున్నారని గుర్తు చేశారు. మహానేత అడుగు జాడల్లో నడుస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. సంక్షేమానికి బద్ధ విరోధి చంద్రబాబు అన్నారు.

కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ.. ప్రతి పేదవాడి గుండెలో మహానేత డాక్టర్ వైఎస్సార్ చిరస్థాయిగా నిలిచారన్నారు. పేదవారిని ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఆయన నిరంతరం ఆలోచించేవారని, అదే స్థాయిలో జగనన్న ప్రజలకు పదుల సంఖ్యలో పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఏడాదిలోపే కూటమి పాలనపై ప్రజలు విసుగు చెందారన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కార్పొరేటర్లు ఆర్షియా ఫర్హీన్, మునెమ్మ, రాజేశ్వర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, రెడ్డి మంజులత, పార్టీ నాయకులు గడ్డం రామక్రిష్ణ, కిషన్, షరీఫ్, రైల్వే ప్రసాద్, రాఘవేంద్ర, అక్కిమి హనుమంతరెడ్డి, మహిళా విభాగం నాయకురాళ్లు మంగమ్మ, భారతి, పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగం నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో..

స్థానిక ఎస్టీబీసీ కళాశాల కమిటీ హాలులో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కేక్ కటింగ్, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మెగా రక్తదాన శిబిరంలో 154 మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తం యూనిట్లను ఆర్.ఆర్.బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి, కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కాటసాని శివ నరసింహా రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నాయకులు బుట్టా ప్రతుల్, దుర్గాప్రసాద్, వెంకటేష్, నజీర్, ఆశోక్, అనిల్, శంకర్, మధుమోహన్ రెడ్డి, సాయి, వీరేష్, కిట్టు ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

కర్నూలు(సెంట్రల్): జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన భౌతికంగా లేకపోయినా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. తరువాత ఎస్‌బీఐ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, ఖాద్రీబాషా, అనంతరత్నం మాదిగ, బజారన్న, షేక్‌ఖాజా హుస్సేన్, డీవీ సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు, మేయర్ బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్ తదితరులు



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

విద్యా హక్కు చట్టం పక్కాగా అమలుచేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఉచితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కేటాయించాలని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడానికి 53, 54 జీఓలు ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీసమ్మ, కర్రెమ్మ, శేషమ్మ, నాగమద్దమ్మ, రాముడు, అంజనేయులు, పీటర్ పాల్గొన్నారు.

నగరపాలక కమిషనర్ బదిలీ



ఎస్.రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు బదిలీ అయ్యారు. ఆయన్ను అనంతపురం మున్సిపల్ పరిపాలన శాఖ ప్రాంతీయ సంచాలకులుగా నియమించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ప్రభుత్వ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పి.విశ్వనాథ్‌ను కర్నూలు కమిషనర్‌గా నియమించారు. గతేడాది సెప్టెంబర్ 18న ఆయన కర్నూలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి 9 నెలల పాటు పనిచేశారు.

గిరిజన సర్పంచ్‌కు అవమానం

ఓర్వకల్లు : జిల్లాలో కూటమి పాలన అధికారంలోకి వచ్చాక నిమ్నజాతి ప్రజా ప్రతినిధిలకు అడుగడున అవమానాలు ఎదురవుతూనే ఉన్నాయి. తాజాగా గుడుంబాయి తండా గ్రామ సర్పంచు దీప్తిబాయికి అవమానం ఎదురైంది. మండలంలోని గుడుంబాయి తండాలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితతో పాటు, ఆ పార్టీ నాయకులు హాజరయ్యారు. అయితే ప్రొటోకాల్ ప్రకారం గ్రామ ప్రథమ పౌరురాలు, సర్పంచుకు ఎలాంటి సమాచారం లేకుండా కార్యక్రమం నిర్వహించారు. తాను గిరిజన మహిళను కాబట్టే తనకు అధికారుల నుంచి గానీ, ప్రజా ప్రతినిధుల నుంచి గానీ ఎలాంటి పిలుపు ఇవ్వలేదని సర్పంచ్ దీప్తీబాయి ఆవేదన వ్యక్తం చేశారు. ముక్కుమొఖం తెలియని వారికి సమాచారం ఇచ్చి బాధ్యతయుతమైన సర్పంచుగా తనకు సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం అంతర్యమేమిటని ఆమె తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. కావున ప్రొటోకాల్‌ను విస్మరించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, ఇకమీదట ఇలాంటి ఘటనలు పునరావృతం చెందకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు.

ఉద్యాన పంటలు లాభదాయకం



మామిడి మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్): ఉద్యాన పంటల సాగు రైతులకు లాభదాయకమని కర్నూలు జిల్లా కలెక్టరు పి. రంజిత్ బాషా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పి. రుద్రవరం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రైతు పి. ఖాసీం పొలంలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6 వేల ఎకరాల విస్తీర్ణంలో. పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తొలిరోజే జిల్లా వ్యాప్తంగా 1000 ఎకరాల్లో పండ్ల తొటల పెంపకం చేపట్టామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో కిదారి సందీప్ కుమార్, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఏపీడీ పద్మావతి, కర్నూలు రూరల్ తహసీల్దారు రమేష్ బాబు, ఎంపీడీవో రఘునాథ్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌యూ బీటెక్ సెమిస్టర్ పరీక్షలకు 99 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీటెక్ సెమిస్టర్ పరీక్షలకు మంగళవారం 99 శాతం హాజరు నమోదైంది. 3, 6 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 253 మందికిగాను 251 మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

13న భావసార క్షత్రియ కుల విందు

కర్నూలు(అర్బన్): భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆషాఢ మాస కుల విందు మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించనున్నట్లు సమాజ్ జిల్లా అధ్యక్షుడు నీమ్‌కర్ శివశంకర్ రావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 6న ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి రోజున ఉదయం 11.45 గంటలకు రుక్మిణి పాండురంగ స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించామన్నారు. ఈ నేపథ్యంలోనే 13న కుల విందు మహోత్సవం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే భావసార క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించామన్నారు. కుల విందు కార్యక్రమంలో పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా కర్నూలు నగర శివారుల్లో భవసారుల కుల దైవం హింగుళాంబిక మాత దేవాలయ నిర్మాణం జరుగుతోందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



గర్భిణితో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు హెచ్చరించారు. మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహిస్తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాపై మహిళలకు అవగహన కల్పించారు. ఆడపిల్లల రక్షణ బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టరు నాగరాజు, ఆరోగ్య కార్యకర్త కృష్ణవేణి పాల్గొన్నారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు



లాడ్జిల్లో తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు: రాత్రి గస్తీని పటిష్టం చేసి నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పోలీసులు లాడ్జీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఎవరైనా లాడ్జీల్లో బస చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానం వ్యక్తపరచిన వారి వివరాలను ఆరా తీశారు. లాడ్జీల్లో బస చేసే వ్యక్తుల గుర్తింపు కార్డులు తీసుకుని వివరాలు నమోదు చేసుకోవాలని, పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని లాడ్జి యజమానులకు సూచించారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌తో రాత్రివేళల్లో నేరాలు జరగకుండా రాత్రి గస్తీని పటిష్టం చేయాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వేలి ముద్రలను చెక్ డివైజ్ ద్వారా సేకరించాలని సూచించారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, అభిమానులు



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న కాటసాని, పార్టీ నాయకులు

- మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు
- నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి
- గడివేములలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం

గడివేముల: అలవిగాని హామీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన మోసగాళ్లు చంద్ర బాబు, కూటమి నాయకులని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడివేములలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కాటసాని ఆధ్వర్యంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాటసాని మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచి సీఎం కుర్చీ ఎక్కగానే చంద్రబాబు మేనిఫెస్టోని చెత్తబుట్టలో పడేశారన్నారు. తల్లికి వందనం పేరు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లి తండ్రులను మోసం చేశారన్నారు. చాలామందికి తల్లికి వందనం పథకం కింద డబ్బులు పడక సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదన్నారు. గతంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పథకం ఇంటి పంపించడంతో పాటు వారి బాగోగులు జగన్ చూసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, వితంతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షురాలు కల్పలతారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మధుసూదన, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్‌లు అంజనమ్మ, ఉపసర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, అనంద్‌రెడ్డి, శివరాంరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సుబ్బారెడ్డి, పుల్లయ్య, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. మంగళవారం స్థానిక స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు, ఐరన్ మాత్రల పంపిణీ, విటమిన్-ఎ ద్రావణం పంపిణీ, నవజాత శిశు సేవల వివరాలను క్రమం తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. అసంక్రమిత వ్యాధులపై సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఆ వ్యాధి నివారణ గురించి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, వార్డులలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. గర్భిణులలో రక్తహీనత శాతం నిర్ధారణ కోసం హిమోగ్లోబిన్ పరీక్షలు సమయానుసారంగా నిర్వహించి ఐరన్‌మాత్రలు, ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్‌తో చికిత్సలు అందేటట్లు చూడాలని, అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, డీపీఓ విజయరాజు,బయాలజిస్టు వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు



డాక్టర్ రవిబాబును సత్కరిస్తున్న జిల్లా అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్): అంకిత భావం, జవాబుదారీతనంతో పనిచేస్తే చక్కటి గుర్తింపు లభిస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులుగా పనిచేస్తూ అనంతపురం జిల్లాకు బదిలీ అయిన డాక్టర్ రవిబాబు సన్మాన సభ మంగళవారం సాయంత్రం స్థానిక పీవీసీలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు హాజరై డాక్టర్ రవిబాబు అందించిన సేవలను కొనియాడారు. జిల్లాలో పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం వీఏఎస్, సహాయ సంచాలకులుగా సుదీర్ఘకాలం పనిచేసి వ్యాక్సినేషన్‌లో ఉమ్మడి జిల్లాకు మంచి పేరు తెచ్చార ని కొనియాడారు. వ్యాధి నిర్ధారణలో నాణ్యత ఉండే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. సన్మాన గ్రహీత రవిబాబు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. విధి నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీలు, పశు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం ఆటో ఢీకొని కురవ నాగన్న(45) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూజారి మల్లేష్ తండ్రి నాగన్న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలకు నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన కురవ నాగన్న వచ్చాడు. అంత్యక్రియలు పూర్తి అయ్యాక తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు మగపిల్లలు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సోమరితనం ప్రమాదకరం

కల్లూరు: సోమరితనం ప్రమాదకరమని విజయ ఆస్పత్రి అధినేత విజయ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం విజయ ఆస్పత్రి స్థాపకులు స్వర్గీయ రామకృష్ణారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పెద్దపాడులోని దామోదరం సంజీమయ్య బాలల సందనంలో అనాథ పిల్లలకు బ్యాగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు తమ జీవన ప్రయాణంలో కిందపడిన ఎదురు దెబ్బలు తగిలినా ముందుకు సాగుతూ గమ్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ జిల్లా అధికారి టి. శారద, సిబ్బంది పద్మ, విజయలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన స్కూల్ పంచాయతీ





స్కూల్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, కర్నూలు డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీచర్లు

కర్నూలు సిటీ: రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన స్కూల్ ఇప్పుడు తరచుగా ఆందోళనలు.. ఫిర్యాదులతో ప్రతిష్ట మసకబారుతోంది. పట్టణ ప్రాంతలోని నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఏర్పాటైంది డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ మోమెరియల్ హైస్కూల్. మున్సిపల్ స్కూళ్లలో చదువుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రతిభావంతుల కోసం కార్పొరేట్ స్థాయికి మించిన స్కూల్‌ను ఏర్పాటు చేయాలని 2020 అక్టోబరు 29న కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ఈ మేరకు భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో స్కూల్ ఏర్పాటుకు 2020లో అప్పటి నగరపాలక సంస్థ కమిషనర్ బాలాజీ చేసిన ప్రతిపాదనల మేరకు 6 నుంచి 10వ తరగతి వరకు, ప్రతి తరగతికి 60 సీట్ల చొప్పున అనుమతులు ఇస్తూ 2021 మార్చి 10న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ ఎం.ఎస్ నంబరు 20 జారీ చేశారు. అడ్మిషన్లు భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఒక్కో తరగతిలో 60 సీట్లలో 50 సీట్లు ప్రవేశ పరీక్ష ద్వారా, మిగిలిన 10 సీట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నియంత్రణలో ఉండేలా తీర్మానం చేశారు. ఈ స్కూల్ మొదటి ఏడాది నుంచే టెన్త్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి గుర్తింపు పొందింది. అయితే ఇటీవలే విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా అబ్దుల్ కలాం స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్లు.. ఉపాధ్యాయుల బదిలీల చట్టం ప్రకారం బదిలీ అయ్యారు. అయితే స్కూల్‌లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు కొందరు.. ఈ టీచర్లు వద్దు.. గతంలో పని చేసిన టీచర్లే కావాలంటూ గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తూ.. అధికారులకు సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సైతం కొంత మంది పేరెంట్స్ వచ్చి పాత కంట్రోల్ రూం సర్కిల్‌లో ఆందోళన చేశారు. దీంతో ఆ స్కూల్‌లో పని చేసే హెచ్‌ఎం, టీచర్లు సైతం తాము చట్ట ప్రకారం బదిలీపై వచ్చామని, బదిలీపై వచ్చినప్పటి నుంచి కొందరు పేరెంట్స్ తమ విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరిస్తున్నారని, వారు ఉద్దేశపూర్వకంగా తమను అగౌరపరుస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఎస్పీ స్పందించి బుధవారం పేరెంట్స్‌ను పిలిచి మాట్లాడతామని హామీఇచ్చారు.

10న గురుపూర్ణిమ వేడుకలు



మాట్లాడుతున్న మురళీ మనోహర్

కర్నూలు కల్చరల్: గురుపూర్ణిమ పురస్కరించుకొని ఈనెల 10వ తేదీ దక్షిణ షిరిడీగా పేరుగాంచిన ఓల్డ్‌సిటీలోని షిరిడీ సాయిబాబా దేవస్థానంలో గురుపూర్ణిమ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలక మండలి సభ్యులు మురళీ మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3న ఉదయం 8.45 గంటల నుంచి 10న ఉదయం 8.46 నిమిషాల వరకు ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి అఖండ సప్తాహం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో నిర్వహిస్తున్న సప్తాహంలో పాల్గొంటున్నారన్నారు. గురువారం ఉదయం నుంచి విష్ణు సహస్రనామావళి, మహాభిషేకం, ధునిపూజ, సాయి సత్య వ్రతం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు సంధ్య హారతి, ఉట్టి కొట్టే కార్యక్రమం, పల్లకీ సేవ, రథోత్సవం, శేజ్ హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులందరూ వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పాలక మండలి సభ్యులు ఆర్.రామ్మోహన్, కోశాధికారి ఎస్‌జీ మహాబలేష్ పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో సారా పట్టివేత



స్వాధీనం చేసుకున్న నాటుసారా, ద్విచక్ర వాహనం

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడుంబాయి తాండా గ్రామ శివారులో వాహన తనిఖీల్లో సారా పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ ఆదేశాల మేరకు ఎస్ఐ నవీన్ బాబు తన సిబ్బందితో గుడుంబాయి తాండా శివారులో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన నాగేంద్ర నాయక్ ద్విచక్ర వాహనంపై 15 లీటర్ల నాటుసారాను కాల్వ గ్రామానికి తరలిస్తుండగా నిఘా వేసి పట్టుకునేందుకు ప్రయత్నించగా వాహనం వదిలేసి నాగేంద్ర నాయక్ పారిపోయాడు. సారాతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే బంగారుపేటకు చెందిన నీలిషికారి రమేష్ వద్ద కూడా 12 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఈరన్న, మధు, రామచంద్ర, సూర్యనారాయణ, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.